క్లుప్తంగా

పంటల పరిశీలన


రైతుతో మాట్లాడుతున్న అరుణకుమారి

ఆమనగల్లు: మండలంలోని ఆకుతోటపల్లి, సింగంపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పత్తి, జొన్న, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించి, పలు సూచనలు చేశారు. పత్తి పంటలో ఆకులు ఎర్రబారడం కనిపించిందని దీనికి ఇమెడక్లోఫిడ్, సాఫ్, ఫార్ములా 4 కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు సాయిరాం, శివతేజ పాల్గొన్నారు.

ప్రజాపరిషత్ సూపరింటెండెంట్‌గా జంగయ్య



ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు సూపరింటెండెంట్‌గా జంగయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన క్రాంతికిరణ్ ఆమనగల్లుకి బదిలీపై వెళ్లారు. మంచాల మండల ప్రజాపరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పని చేసిన జంగయ్య బదిలీపై ఇబ్రహీంపట్నం వచ్చారు. ఎంపీడీఓ వెంకటమ్మతో పాటు సిబ్బంది జంగయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నామినేషన్


శ్రీకాంత్

ఆమనగల్లు: ఆమనగల్లు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ప్రస్తుత పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ సోమవారం ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లురవి సహకారంతో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నట్లు శ్రీకాంత్ వివరించారు. యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టానని, పార్టీ పటిష్టతకు కృషి చేశానని అన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నరేష్‌గౌడ్ పోటీ



తలకొండపల్లి: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండలంలోని గౌరిపల్లికి చెందిన గుండ్రాతి నరేష్‌గౌడ్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు సోమవారం తెలిపారు. గత పది ఏళ్లగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవి సహకారంతో విజయం సాధిస్తానని నరేష్‌గౌడ్ దీమా వ్యక్తం చేశారు.

ఆర్థిక సహాయం


పరామర్శిస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన జల్లెల సుగుణమ్మ (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు జల్లెల శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీటీసీ జోగు రమేష్‌లు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రెడ్డి రూ. 3000, శ్రీశైలం యాదవ్ రూ. 2500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, పెంటయ్య, తిరుపతి, రామచంద్రయ్య, లక్ష్మీనారాయణ, రాములు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిన నేతలు

తలకొండపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వెల్జాల్, జంగారెడ్డిపల్లి, తదితర గ్రామాల నుంచి గౌడ సంఘం నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు, అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. తరలిన వారిలో మాజీ ఎంపీపీ నిర్మలాశ్రీశైలంగౌడ్, మండలగౌడ సంఘం అధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, కృష్ణయ్యగౌడ్, సాయికుమార్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, శశికుమార్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, అల్లాజిగౌడ్ ఉన్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆమనగల్లు పట్టణంలోని ఆయా కాలనీల్లో ఉన్న అంతర్గత రోడ్లన్నీ పూర్తిగా గుంతలమయం అయ్యాయి. చిన్నపాటి వర్షానికే రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. **దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.** గుంతల్లో వర్షాలకు నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కావునా, సంబంధిత అధికారులు స్పందించి, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

– ఆమనగల్లు


వెంకటేశ్వర కాలనీలో చిత్తడిగా మారిన రోడ్డు


ఆమనగల్లులోని ఆదర్శనగర్‌కాలనీలో రోడ్డు


ప్రేమ్‌కాలనీలో..


ఆదర్శనగర్‌కాలనీలో..


శాంతినగర్ కాలనీలో..

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కద్తాల్: రైతుబీమా కోసం కొత్తగా పట్టాదారు పాసు బుక్ వచ్చిన రైతులతో పాటు, ఇప్పటి వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని, మండల వ్యవసాయ అధికారి శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు బీమా దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, రైతు నామిని ఆధార్ కార్డు జిరాక్స్ జతచేసి, వ్యవసాయ విస్తరణ అధికారికి, స్వయంగా రైతు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: రైతుబీమా కోసం మండలంలోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి ఒక ప్రకట నలో పేర్కొన్నారు. 28 జూన్ నాటికి పట్టాదారుపాసుపుస్తకాలు అందుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ


సిబ్బందితో మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ

తుర్కయంజాల్ : పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. సోమవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో కౌన్సిలర్లతో కలిసి ఆమె కార్మికులకు సబ్బులు, నూనెల, రక్షణ పరికరాలను పంపిణీ చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరలో హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కె. అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగమ్మ, ఉదయశ్రీ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు

- సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం
- వచ్చే నెల 31 వరకు నాట్లు వేసుకోవచ్చు


పడకల్‌లో వరినాట్లు వేస్తున్న కూలీలు

తలకొండపల్లి: గత మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూమి నాని భూమిలోకి నీరు ఇంకి భూగర్భ జలాలు పెరిగే అవకాశముంటుందన్నారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లోని ఎక్కువ మంది రైతులు వరిసాగుపై ఆసక్తి కనబర్చుతున్నారు. బోర్లలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉండడంతో చాలా మంది రైతులు వరినాట్లు వేస్తున్నారు. మరి కొందరు కరిగెట్లు పనిలో నిమగ్నమయ్యారు. గత ఎడాది వానాకాలంలో మండలంలో 8 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువగా సాగు పెరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. బియ్యం ధరలు పెరిగిన కారణంగానే రైతులు వరిసాగును ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత వానాకాలంలో క్వింటా బియ్యాన్ని రూ. 5000 నుంచి 6000 వరకు విక్రయించారు. ఈ సారి మరో రూ. 1000 పెరిగే అవకాశముందని రైతులు అంటున్నారు. రైస్ స్టోర్స్‌లో కొంటి బియ్యం ధర రూ. క్వింటాళ్లకు రూ. 7000 నుంచి రూ. 8000 పలుకుతుంది. ఫలితంగా మార్కెట్లో సన్న బియ్యానికి విపరీతమైన డిమాండ్ పెరుగడంతో అన్నదాతలు ఎక్కువగా వరి సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ సారి వర్షాలు కాస్త ఆలస్యం కావడంతో ఆగస్టు 31 వరకు వరినాట్లు వేసుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు.

చదువులపై ఆసక్తి పెంచాలి

సీడీపీఓ శాంతిశ్రీ


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న శాంతిశ్రీ

ఇబ్రహీంపట్నం రూరల్: చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు చదువుపై శ్రద్ధ కల్గించేలా ప్రతి టీచర్ పని చేయాలని ఇబ్రహీంపట్నం ప్రాజెక్టు సీడీపీఓ శాంతిశ్రీ పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలకలు ఇచ్చిన అక్షరాలు నేర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చదువులు నేర్పాలన్నారు. బాల్యం నుంచే చదువులపై శ్రద్ధ ఆసక్తి పెంచాలన్నారు. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీకి పంపించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పన, తులసి, పల్లవి, అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్


ఆమనగల్లు: మొక్కలు నాటుతున్న రాంపాల్‌నాయక్, కౌన్సిలర్ సుజాతారాములు


కడ్తాల్: మొక్కలు నాటుతున్న దృశ్యం

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కోరారు. ప్రతి ఇంటి ఎదుట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ సుజాతారాములుతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని అన్నారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు ఉద్యమస్పూర్తితో మొక్కలను నాటాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కమిషనర్ వసంత, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, రాములు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజానికి మొక్కలు పెంచాలి

కడ్తాల్: కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఏడో విడత గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం ఒడిశా స్పీకర్ సురమా పాది, గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ భువనేశ్వర్‌లో సోమవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పరిసరాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనలో హరితహారంతో కోట్ల సంఖ్యలో మొక్కలు నాటి దేశంలోనే రికార్డు సృష్టించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి,లాయక్‌అలీ, రాంచంద్రయ్య విద్యార్థులు ఉన్నారు.

కుక్కలదాడిలో నెమలికి గాయం

ఇబ్రహీంపట్నం రూరల్: కుక్కలదాడిలో గాయపడ్డ నెమలిని కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మండలంలోని రాయపోల్ అటవీ సమీపంలో ఓ మయురాన్ని కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అక్కడే ఉన్న ఓ యువకుడు కాపాడి పోలీసులకు అప్పగించారు. పోలీసులు అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం మళ్లీ అడవిలో వదిలినట్లు సిబ్బంది హనుమంతు తెలిపారు .

కూలిన ఇల్లు


చంద్రధనలో పడిపోయిన ఇల్లు

తలకొండపల్లి: ముసురు వర్షాలకు సోమవారం మండలంలోని చంద్రధనలో ఓ ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన ఎన్నెడ్ల చంద్రకళ మట్టి ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో బాధితులు రోదించారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

వడ్డెరల సమస్యలు పరిష్కరించండి

ఆ సంఘం నాయకుడు రాజు



మల్లుకు సంఘీభావం తెలిపిన రాజు, నేతలు

కడ్తాల్: రాష్ట్రంలో వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వడ్డెర సంఘం నాయకుడు వడ్డే రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు హైదరాబాద్‌లోని ఇంద్ర పార్క్ వద్ద సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. దీక్షకు మద్దతుగా మండల కేంద్రం నుంచి రాజు ఆధ్వర్యంలో, వడ్డెర కులస్తులు హైదరాబాద్ తరలి మల్లుకు సంఘీభావం తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వడ్డెర కులస్తుల సమస్యలను గుర్తించకపోవడంతో, విసుగుచెంది కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచామన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, వడ్డెరలను బీసీ జాబితా నుంచి తొలగించి, ఎస్టీ జాబితాలో చేర్చుతామని ప్రకటించారని గుర్తు చేశారు. వడ్డెరలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో కూడా పొందుపరిచారని తెలిపారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, రాజు, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ ఉన్నారు.

ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయండి


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సభ్యులు

కడ్తాల్: రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 26, 27, 28 తేదీల్లో ఎల్బీనగర్‌లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌కు, ఫోటో గ్రాఫర్లు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్‌తో కలిసి, ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అసోసియేషన్ సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రబ్బానీ, కార్యదర్శి బీష్మాచారి, కోశాధికారి కిరణ్, నదీమ్, సభ్యులు శివ, కృష్ణ, మహేశ్, సాయి, ధనంజయ్, గిరి, హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య తదితరులు ఉన్నారు.

కలగానే బీసీ కార్పొరేషన్ ఏర్పాటు

బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భాషా


యాచారం: ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న భాషా తదితరులు


కడ్తాల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఓబీసీ సెల్ నాయకులు

యాచారం: ఎన్నికల ప్రచారంలో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఏమైందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్, బీసీ కార్పొరేషన్, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఓబీసీ మోర్చా పిలుపు మేరకు సోమవారం యాచారంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్ అమలు కాంగ్రెస్ సర్కార్ మర్చిపోయిందా అని నిలదీశారు. కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు నరేష్, బీజేపీ సీనియర్ నాయకులు యాదయ్య, జంగయ్యగౌడ్, గోగికార్ రమేష్, ముంత జంగయ్య, శ్రీధర్‌గౌడ్, విజయకుమార్ పాల్గొన్నారు.

తక్షణమే అమలు చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బీజేపీ, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు మాసాల్లో బీసీ జనగణన ప్రకారం స్థానిక సంస్థలో బీసీలకు 23శాతం నుంచి 43శాతానికి రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. దీంతో పాటు బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తూ బీసీలను మోసం చేస్తున్నారన్నారు. అంతకు ముందు తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, రాష్ట్ర నాయకుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, రమాదేవి, రంగా జంగయ్యగౌడ్, అంజయ్య, పాపయ్యగౌడ్ పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ల శాతం పెంచాలి

కడ్తాల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల శాతం పెంచాలని, బీజేపీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు మాలే శ్రీశైలంగౌడ్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో, బీసీల సమస్యలను పరిష్కరించాలని, బీసీలకు స్థానిక సంస్థలో రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ , తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల సభలో, సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా , బీసీలకు స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు, కులగణన చేపట్టి, బీసీలకు 23 శాతం నుంచి 43 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామన్నారని గుర్తు చేశారు. అదే విధంగా గొల్లకురుమలకు గొర్ల పంపిణీ, బీసీ విద్యార్థులకు 100 శాతం ఫీజు రియింబర్స్‌మెంట్ , ఆర్థికంగా వెనుకబడిన బీసీ కులాలకు ఎలాంటి షూరిటీ లేకుండా రూ.1లక్ష రుణం ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, నాయకులు మహేశ్, వెంకటేశ్, రాంచందర్, రెడ్యానాయక్, శంకర్‌నాయక్, వెంకటేశ్‌యాదవ్, శ్రీను, రాకేశ్, కల్యాణ్, అజిత్, సంతోష్ ఉన్నారు.